జ్ఞాపకం వచ్చిన సంఘటనను తలచుకొని చలించిపోయాడు రాఘవేంద్ర నాయుడు.

నిన్నటివరకూ తన కొడుకు దాదాపు జులాయి. మరి నేడు కర్తవ్యం తెల్సుకుంటున్న వ్యక్తి!

కొడుకు టేబుల్ మీద పెట్టిన వెయ్యి రూపాయల్ని తీసి, పదినోట్లూ లెక్కబెట్టాడు. పది వంద రూపాయల నోట్లు అవి.

ఇవాళ ఆ వెయ్యి రూపాయలు తనకు లెక్కలోనికి రాదు. కానీ తను వ్యాపారం చేస్తానని, తన తండ్రితో మొట్టమొదటిసారి అన్న రోజు తన తండ్రి చెప్పిన సలహా ఇప్పటికీ రాఘవేంద్ర నాయుడుకి బాగా జ్ఞాపకం.

"బాబూ రాఘవా! నీకో చిన్న విషయం కానీ గొప్ప విషయమని నేను భావిస్తున్న విషయం చెప్తాను విను. సాధారణంగా మనుషులు భరించలేని దు:ఖం వచ్చినపుడు ఏకాంతాన్ని కోరుకుంటారు. సహించగలిగే సుఖం వచ్చినప్పుడు ఏకాంతాన్ని కోరుకుంటారు కానీ వ్యాపారవేత్తకు కావలసింది భరించలేని దు:ఖం వచ్చినపుడు పదిమంది మధ్య ఉండటం- సహించగలిగే సుఖం వచ్చినపుడు కూడా, ముందు వ్యాపారం, ఆ తర్వాతే సుఖం అనుకో - నువ్వు వ్యాపారవేత్తగా రాణిస్తావ్-కానీ నిజమైన వ్యాపారవేత్తకు ఉండాల్సిన ఇంకో లక్షణం నిజాయితీ-నీ కోసం కష్టపడేవాడి అవసరాన్ని గమనించు. వాడు నీ వెనకే వుంటాడు. ఒకడు నీతో పాటు, నీ మంచి కోరి వుండాలంటే, నువ్వు వాడి జీవితం పట్ల అపారమైన ప్రేమతో వుండాలి. వాడు ఎంత చిన్న ఉద్యోగి అయినా ఫర్వాలేదు-వాడింటికి వెళ్ళు. వాడిని, వాడి భార్యని, పిల్లల్నీ ఆత్మీయంగా పలకరించు- నీ హోదా కూడా గుర్తించకుండా, నువ్వొచ్చావని వాడు నీ కోసం వాడి లైఫ్ మొత్తం ధారపోస్తాడు."

ఇన్నాళ్ళకు తన కొడుక్కి ఏ విషయమూ చెప్పలేదు తను. కానీ కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పాల్సిన అవసరం వుంది. బాధ్యత తెల్సిన తండ్రిగా ఆ విషయాలు చెప్పాలి.

"బాబూ! మధూ ..... ఒక్కగానొక్క కొడుకువి కాబట్టి నిన్ను కొంచెం ప్రేమగా పెంచి ఉండొచ్చు. కానీ ..... జీవితం అంటే ఇది కాదని నీకు తెల్సినందుకు నాకు

చాలా సంతోషంగా వుంది నువ్వెన్నో తప్పులు చేసావ్. ఆ తప్పుల్ని నేను క్షమించాను. కానీ నీ తప్పుల్ని నేను ఒక బిజినెస్‌మెన్‌లా కాక ఒక తండ్రిగా క్షమించాను. అప్పుడు నువ్వు నా బిడ్డవు. కాని ఇప్పుడో - ఒక వ్యాపారవేత్తవు కాబోతున్నావ్. బిజినెస్ మాన్‌కి అవలక్షణాలు ఉండలని నేను కోరుకోవడం లేదు. ఒక అవలక్షణం నిన్ను ఆక్రమించుకునే ముందు, దాన్లోకి నువ్వెందుకు వెళుతున్నావో, దానికి కారణాలేమిటో ఒక్క క్షణం ఆలోచించు.

చిన్న విషయం .....

అప్పుడు నాకు ఇరవై ఏళ్ళ వయసు పల్లెటూళ్ళో బతకలేక, ఏదో చెయ్యాలని, ఏదో సాధించాలని మొట్టమొదటిసారి హైద్రాబాద్ వచ్చాను. ఎవరూ, ఏ ఒక్కరూ తెల్సినవాళ్ళు లేరు. ఎక్కడకెళ్ళాలో తెలీదు. ఏం చెయ్యాలో తెలీదు. హిందీ భాష రాదు. రోడ్డు పక్క చిన్న సూట్‌కేస్ పట్టుకుని నడుస్తున్న నాకు ప్రతీదీ వింతగా, ఆశ్చర్యంగా కనిపించింది.

జీవితంలో నేనెప్పుడూ అనుకోలేదు- హైద్రాబాద్ వస్తానని.

రోడ్డుకి అటూ ఇటూ కన్పిస్తున్న ఎన్నో భవనాలు, కులాసాగా కార్లలో పోతున్న మనుషులు ..... ఎప్పటికైనా నేను వాళ్ళలా కారులో తిరగగలనా? ఖరీదైన బిల్డింగ్‌లో వుండగలనా? ఆ సమయంలో నా ఆలోచనలకు నాకే నవ్వొచ్చింది.

సినిమా వాల్‌పోస్టర్ చూసిన ప్రతివాడూ తనకేమిటి, తనూ యాక్టర్ కాగలననుకుంటాడు. తనకేం తక్కువ సత్యజిత్‌రే, రాఘవేంద్రరావు, మన్‌మోహన్ దేశాయ్, సుభాష్ ఘాయ్, రామ్‌గోపాల వర్మ కాగలననుకుంటారు.

ప్రతి అమ్మాయీ నేనేం శ్రీదేవికి తీసిపోయానా, మాధురీ దీక్షిత్‌కి తీసిపోయానా అని అనుకుంటుంది. ప్రతీ యువకుడూఎన్టీఆర్‌కి, ఏ ఎన్నార్‌కి, తీసిపోయానా అనుకుంటాడు.

నేను జార్జి బుష్‌ని అవగలను. గోర్బచేవ్‌ని అవగలను. ఎల్సిన్‌ని అవగలను. హెన్రీ ఫోర్డ్‌ని అవగలను. లీ అయికోకాని అవగలను. అమితాబ్ బచ్చన్ని అవగలను. అద్వానీని అవగలను ..... అని అనుకుంటారు.కలలు కంటారు.

అనుకోవడంలో తప్పేం లేదు- కలలు కనటంలోకూడా ముప్పేంలేదు కాని అవకాశాల్ని చక్కగా వినియోగించుకోవడంలోనే మనిషి ప్రతిభ కన్పిస్తుంది.

ఇప్పుడు నేను చెప్పిన నటులు, వ్యాపారవేత్తలు, పోలిటిషియన్స్ ఒక్క రాత్రిలో అంత స్థాయికి ఎదగలేదు. వాళ్ళేం కావాలో వాళ్ళనుకున్నారు- వాళ్ళు కన్న కలల్ని నిజం చేసుకోవాలని వారి వారి రంగాల్లో అనవరతం శ్రమించారు, శ్రమిస్తున్నారు. ఊరకే అనుకొని- కలలు కని వాళ్ళు ఊరుకోలేదు. అందుకే ఎదిగారు.

ఒకటి గుర్తుంచుకో ..... నువ్వు చేసే పనులే నీ భవిష్యత్‌కు ఆధారాలౌతాయి. నాకు అదృష్టం కల్సి వస్తే తప్ప నేనేమీ కాలేనని అనుకుని ఓ మూల కూర్చున్నావనుకో ..... నువ్వేమీ కాలేవు. దేశంలో వాణిజ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులొస్తున్నాయి. దేశం బాగుపడవచ్చేమో ..... మొత్తానికి ఇప్పటికైనా దేశాన్ని పారిశ్రామిక పథంవేపు శరవేగాంతో నడిపించిన ది గ్రేట్ జె.ఆర్.డి. టాటాకు భారత్న రత్న ఇచ్చి సత్కరించారు. అదెప్పుడో జరగాల్సింది. ఇప్పటికైనా జరిగినందుకు సంతోషం. ఈ మార్పు నీలాంటి కొత్తఎంటర్ ప్రెన్యూర్స్‌కి అవకాశాల్ని, ఆశాభావాన్ని కలిగిస్తుంది. కలిగించాలి కూడా. కష్టించి పనిచేయటానికి ప్రత్యామ్నాయం లేదని జె.ఆర్.డి జీవితం రుజువు చేసింది.

అందుకే సాలెపురుగు నా కిష్టం. ప్రతి మనిషి సాలెపురుగు కావాలి. ఆహారం దొరికినా, దొరక్కపోయినా సాలెపురుగు గూడు అల్లుతూనే వుంటుంది. నిర్మాణ కార్యక్రమం ..... నిరంతర నిర్మాణ కార్యక్రమం ..... అలుపుసొలుపు లేని నిర్మాణ కార్యక్రమం. ఆ నిర్మాణ కార్యక్రమాన్ని మనిషి నిరంతరం అలవరచుకోవాలి.

అప్పుడు, ఆ రోజు-- అలా నడిచి, నడిచి నేనెక్కడకు వెళ్ళానో నాకు తెలీదు. కాళ్ళు పీకేవరకూ నడిచాను.

అలసట వచ్చాక ఓ చోట కూర్చున్నాను.

అదొక ఏకాంత ప్రదేశం. పాడుపడిన పాత బిల్డింగు. ఆ బిల్డింగ్ అరుగుమీద కూర్చున్నాను. నాకు కొంచెం దూరంలో ఓ నలుగురు మనుషులు. వాళ్ళు బెగ్గర్స్ కాదు- రోడ్డుమీద చెత్త కాగితాల్నీ, పాత సీసాల్ని, రేకు డబ్బాల్నీ ఏరుకునే వాళ్ళు.

వాటిని ఏరుకుని, వాళ్ళేం చేస్తారు? ఇంతమంది పిల్లాపాపా ఎలా బతుకుతారు? ఏమొస్తుంది?

నాలో ప్రశ్నలు తలెత్తాయి. వాళ్ళు, అప్పుడే, తమ కార్యక్రమానికి వెళ్తున్నారు.

నీవు నమ్మవ్-

వాళ్ళు వెళ్ళిన ప్రతీ చోటకు నేను వెళ్ళాను. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాళ్ళతోనే వున్నాను.

మధ్యాహ్నం మూడు గంటల వరకూ వాళ్ళు చెత్తా చెదారాల్ని ఏరుకున్నారు. ఆ తర్వాత ఒకచోట కూర్చుని దేనికదే విడదీశారు. మూటలు కట్టుకున్నారు. అక్కడ్నించి మార్కెట్‌కు వెళ్ళారు.

వాళ్ళంతా ఆరోజు సంపాదించింది ఎంతో తెలుసా?

యాభై రూపాయలు

అంటే .....

కళ్ళుంటే చూస్తే, కాళ్ళుంటే నడిస్తే, చేతులుంటే పనిచేస్తే, మనసుంటే ఆలోచిస్తే, ప్రతిచోటా, నువ్వు డబ్బును సృష్టించగలవ్.

నాలో కలిగిన మొట్టమొదటి నమ్మకం అది. ఈ సంఘటన నీ కెందుకు చెప్తున్నానో తెల్సా?

ప్రతి మనిషీ కష్టపడడంలో చీమలా ఉండాలి. చురుకుదనంతో డేగలా ఉండాలి. ఆలోచనలో ఆకాశంలా ఉండాలి. గంభీరత్వంలో సముద్రంలా ఉండాలి. ఇవ్వన్నీ నువ్వు అలవర్చుకున్న నాడు, నువ్వు సమాజంలో ఏమైనా కాగలవు.

డబ్బు సంపాదించటం ఒక్కటే ధ్యేయం కాదు- మరికొందరికి నువ్వు మార్గదర్శకం కావాలి. నువ్వు సుఖంగా ఉండడానికి అవసరమైనంత డబ్బు

సంపాదించు. నీ డబ్బు నీకు అతి సుఖాన్ని ఇస్తోందని తెలీయగానే దానికి దూరంగా ఉంటూ, సంపాదించటం మాత్రం మానేయకు. ఒక దశ దాటాక ఆ డబ్బు నీకేం బంగారపు బియ్యాన్ని, వెండి గోధుమల్ని తెచ్చిపెట్టలేదు- కాని నిన్ను నమ్ముకునే వార్ని బ్రతికిస్తుంది. ఆ పైన దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమవుతుంది. అతి సుఖం అజీర్తి లాంటిది-- అది నిన్ను మింగేస్తుంది- గుర్తుంచుకో-" రాఘవేంద్ర నాయుడు కొడుకువేపు చూసాడు. తండ్రి చెప్తున్న ప్రతి విషయాన్నీ, శ్రద్ధగా మననం చేసుకుంటున్నాడు మధుకర్ .

"ప్రతీ వాడూ తనో ఇంటెలిజెంట్‌నని అనుకుంటాడు. మిగతావారి కంటే తనలోనే ఐక్యూ ఎక్కువ వుందని అనుకుంటాడు. కానీ అందరూ ఇంటెలిజెంట్ పీపుల్ అయినపుడు, అందరూ  ఐక్యూ ఎక్కువగా వున్న మనుష్యులే అయినపుడు, ఇంతమంది నిరుద్యోగులు రోడ్ల మీద ఇలా కనబడడానికి కారణం ఏమిటో ఆలోచించావా-- ..... "

ఆ ప్రశ్నకు తను కరెక్ట్‌గా జవాబు చెప్పలేడు-తనకా అనుభవం కూడాలేదు.

"మీరే చెప్పండి." వినయంగా అన్నాడు మధుకర్ .

"దీనికి జవాబు చాలా సింపుల్. అందరూ ఇంటెలిజెంట్ పీపుల్, కానీ ఆ వున్న తెలివితేటల్ని ప్రాక్టికల్ లైఫ్‌లో ఉపయోగించుకోడానికి అనువుగా మలచుకోకపోవడమే దానికి కారణం. మేధావులు ఎక్కడనుంచో పుట్టరు తన ఆలోచనను సక్రమ మార్గంలోకి తెచ్చుకునే ప్రతీవాడూ మేధావే. ఇంకొక విషయం గుర్తుంచుకో-

వ్యక్తిత్వంతో ఎదగాలనుకుంటున్న ప్రతీవాడూ గుర్తుంచుకోవాల్సిన విషయాలివి. ప్రతి వ్యక్తిలోనూ ఉద్రేకాలు, కోరికలూ వుంటాయి.

వాటిలో కొన్నింటిని మనిషి అదుపులోకి తెచ్చుకోవాలి. కొన్నింటిని దూరం చేసుకోవాలి.

ఇవాల్టి చదువులు, డిగ్రీల వల్ల మనిషికి ఉపయోగంలేదు. బ్రిటిషర్స్ ప్రవేశపెట్టిన విద్యావిధానం మన దేశంలో కొనసాగుతున్నంతకాలం, మన దేశం

ఒక్కడుగు ముందుకు వెయ్యలేదు-- నాన్ క్రియేటివ్ ..... గుమస్తా స్థాయి విద్యా వ్యవస్థ. రెడిక్యులస్ సిస్టమ్.

మనిషి శారీరక శ్రమకు, మానసిక శ్రమకు ఆధారమయ్యే విద్యావిధానం కావాలి. అప్పుడే మన దేశం జపాన్‌లా పురోగమిస్తుంది. ఇండిపెండెన్స్ వచ్చి ఇన్నేళ్ళయినా, స్వంత విద్యా విధానాన్ని రూపొందించుకోలేకపోయాం. హోప్‌లెస్ ఇండియన్ పొలిటీషియన్స్ అండ్ పోలిట్రిక్స్ క్షణాల్లో కోట్లని లెక్కలు కట్టే కంప్యూటర్సు వచ్చాక కూడా జంటపద్దు విధానాలు గురించి సంవత్సరాల తరబడి చెప్పటం. యూజ్‌లెస్ ఫెలోస్ ..... జె.ఆర్.డి. ఆటోబయోగ్రఫీని ఒక సబ్జెక్టుగా ఎందుకు పెట్టరో ..... అందుకే దేశం ఇలా వెనుకబడిపోతుంది. నీ తెలివితేటలు, నీ శ్రమ నీకు పెట్టుబడి అని చిత్తశుద్ధిగా నమ్ము.

తర్వాత--

నువ్వు చెయ్యగల పనేమిటో మొదట నిర్ణయించుకో -- ఆ పని కోసం నువ్వేం చెయ్యాలో నిర్ణయించుకో-- ఆ పనిని ఎంతవరకు చెయ్యాలో నిర్ణయించుకో-- నువ్వాపని చేసేటపుడు గుర్తుంచుకోవాల్సింది, ఆ పనిని నువ్వు ఉద్యోగిగా చేస్తున్నావా, యజమానిగా చేస్తున్నావా ..... ? కొన్ని గంటలు నీ పని తర్వాత వచ్చిన ఫలితాన్ని విశ్లేషించుకో.

వ్యాపారంలో అతి ముఖ్యమైనది How to pick your moment ..... ఎక్కడ, ఎలా-- ఎప్పుడు, ఎలా -- ఏమిటి, ఎలా? అని ఎదురయ్యే సంఘటనని నీకు అనుకూలంగా మలచుకోవడంలోనే నీకు తెలివి తేటలున్నాయనేది రుజువవుతుంది. ఒక వ్యక్తిని నువ్వు అర్జంటుగా కలవాలి. అతన్ని కలిసేముందే, అతనితో ఏం మాట్లాడాలి? ఎంతవరకూ మాట్లాడాలన్నది నిర్ణయించుకో.

అతనిలోని పాజిటివ్ పవర్‌తో నీ రిలేషన్ షిప్ వుండాలి.

స్పష్టంగా అభిప్రాయాల్ని వ్యక్తీకరించడం-- బిజినెస్‌లో ఇది అతి ప్రధానమైన విషయం. నువ్వేం చేస్తున్నావో అవతలివాడికి తెలియనప్పుడు నీ బిజినెస్ ఇంప్రూవ్ అవ్వదు. అలాగే అవతలివారి అభిప్రాయాల్ని కూడా స్పష్టంగా వినడం-- ఏ యాంగిల్‌లోంచి చెపుతున్నారో అర్థం చేసుకోవడం కూడా ముఖ్యమే.

కామన్‌సెన్స్--ప్రతివాడూ తను బిజినెస్ చెయ్యగలనని అనుకుంటాడు. చేస్తే లక్షలు సంపాదించగలననీ అనుకుంటాడు-- అలా అనుకోవడంవల్ల లాభంలేదు. వ్యాపారం, ప్రేమలా హృదయానికి సంబంధించిన విషయం కాదు. నువ్వు వ్యాపారవేత్తవో, కావో నిర్ణయించేది మార్కెట్. నువ్వు ఒక ప్రొడక్టుని తయారుచెయ్యాలని నిర్ణయించుకున్నపుడు, అలాంటిది నీకు నచ్చినపుడు, నువ్వు కొనడానికి సిద్ధమైనపుడు, నీ ప్రొడక్టుని కొంటారని గుర్తుంచుకో.

నువ్విపుడు ఏదో చెయ్యాలని, ఏదో సాధించాలని బయటపడుతున్నావ్. కానీ నువ్వు బయటకెళ్ళిన మరుక్షణం నువ్వు గొప్పవాడివై పోవు-- అవకాశాలు నిన్ను వెతుక్కుని రావు.

To everything there is a season, and a time to every purpose under the heaven.

అందువల్ల నీకు అవకాశం కలిసి వచ్చేవరకూ అవకాశం కోసం వెతుకు ..... అందుకోసం నువ్వు ఏ పని చెయ్యడానికయినా సిగ్గుపడకు ..... ఎవరేమనుకుంటారని జంకేవాడెప్పుడూ పైకి రాలేడు గుర్తుంచుకో ..... " రాఘవేంద్ర నాయుడు జీవితసారాన్ని అతి క్లుప్తంగా చెప్పాడు. ఆయన కొడుక్కి చెప్పింది వ్యాపార భగవద్గీత.

ఏ సూత్రాల్ని ఆయన జీవితంలో ఆచరించి, అంత ఉన్నతదశకు చేరుకున్నాడో ..... ఇప్పుడు చెప్పినవన్నీ ఆ సూత్రాలకు సంబంధించిన విషయాలే!

మధుకర్ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. అందరి హృదయాలు బరువెక్కాయి. తల్లీ, తండ్రి ముఖాలు వేపు చూసి మౌనంగా బయటికొచ్చాడు మధుకర్ .

బయటికొచ్చిన-- మధుకర్ జేబులో నిజంగా ఒక్క పైసా కూడా లేదు.

*     *     *     *

"చరిత్ర ఒక కొత్త అధ్యాయంలోకి ప్రవేశించింది."

పి.ఏ. రవికిరణ్ వేపు చూస్తూ అన్నాడు నాయుడు.

రవికిరణ్‌కి  అంతా నమ్మలేని నిజంలా వుంది.

చరిత్రలో జరిగిన  అతి గొప్ప సంఘటనలన్నీ, అతి తక్కువ నిమిషాల్లో జరిగినవే అన్న మాటకు అర్థం స్పష్టంగా తెల్సినట్టయింది. రాఘవేంద్ర నాయుడు సాలోచనగా, రవికిరణ్ వేపు చూసి--

"మీ ఇద్దరి బ్రదర్ ఇన్‌లాలకు వుద్యోగాలు కావాలన్నావ్ కదూ" అడిగాడు రాఘవేంద్ర నాయుడు .

సడన్‌గా ఆ ప్రసక్తి ఎందుకు తెచ్చాడో అర్థం కాలేదు రవికిరణ్‌కి.

"ఎస్ ..... సర్ ..... "

"రేపు వాళ్ళని నా దగ్గరకు పంపించు" అని చెప్పి కుర్చీలోంచి లేచాడు రాఘవేంద్ర నాయుడు భారంగా.

*                    *                    *                    *

అప్పుడు సమయం సరిగ్గా సాయంకాలం ఆరుగంటలయింది.

చలికాలం కావడంవల్ల మసకచీకట్లు కమ్ముకుంటున్నాయి.

మామూలు రోజుల్లో అయితే. ఈ టైమ్‌కి బార్లో వుండేవాడిని అనుకున్నాడు మధుకర్ .

అతనిప్పుడు--

బంజారాహిల్స్‌కి వెళ్ళే రోడ్డుప్రక్కన నడుస్తున్నాడు.

పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకూ రోడ్డుమీద నడిచి ఎరుగనివాడు- నడవాల్సిన అవసరం లేనివాడు.

అయిదో నెంబర్ రోడ్‌లో ఆ పింక్ కలర్ బిల్డింగ్‌ని చూడగానే - ఒక్క క్షణం కదలకుండా ఆగిపోయాడు.

మహతి పట్ల ఎంత క్రూడ్‌గా ప్రవర్తించాడు తను?